

తీరని 'అంతిమ' కష్టాలు!

గత ప్రభుత్వం ప్రతీ ఊరికి వైకుంఠధామం నిర్మించాలని నిర్ణయించింది. కొన్నిచోట్ల నిర్మాణం పూర్తి చేయగా, చాలాచోట్ల నాసిరకంగా నిర్మించారు. అసంపూర్తిగానే మిగిలాయి. 9లో▸



వెళ్లొస్తాం మల్లన్న..

మహా శివారాత్రి సందర్భంగా వేలాలలో మూడు రోజులపాటు నిర్వహించిన మల్లన్నస్వామి జాతర ఆదివారం ముగిసింది. జాతరకు 3 లక్షలకుపైగా భక్తులు తరలివచ్చారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.4 /26.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బాలుర పాఠశాల గేటుకు తాళం



గేటు మూసి తాళం వేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన గేటుకు తాళం వేశారు. 'షెడ్డులో బైక్‌లు.. చెట్ల కిందే సైకిళ్లు' శీర్షికన ఈనెల 6న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్పందించారు. పాఠశాల గేట్లు ఉన్నా తాళం వేయకపోవటంతో ఇతర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లేవారు.. వివిధ పనుల నిమిత్తం వచ్చినవారు వాహనాలను షెడ్డులో నిలిపివెళ్తున్నారు. దీంతో విద్యార్థుల సైకిళ్లు చెట్ల కింద ఎండలో నిలుపుతున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో పాఠశాల యాజమాన్యం ఇతరుల వాహనాలు పాఠశాల ఆవరణలోకి రాకుండా గేటుకు తాళం వేయటంతో విద్యార్థులు 'సాక్షి' కృతజ్ఞతలు తెలిపారు.

'గ్రీన్‌ఫీల్డ్' బాధితుల ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న సూరారం గ్రామస్తులు

లక్సెట్టిపేట: మండలంలోని సూరారం గ్రామానికి చెందిన 63వ నంబర్ జాతీయ రహదారి బాధితులు ఆదివారం ఆందోళన చేశారు. గ్రామంలో జాతీయ రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వం చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవేతో గ్రామ శివారులోని వ్యవసాయ భూములు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా రోడ్డు నిర్మించాలని కోరారు. వ్యవసాయ భూముల నుంచి రహదారి తీయడం వలన ఉపాధి కోల్పోతామని తెలిపారు. తమ బాధను ప్రభుత్వం, అధికారులు పట్టించుకుని రహదారి పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధి కారులు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

రహదారి సర్వే అడ్డగింత



సర్వే పనులను అడ్డుకుంటున్న బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరసల జాతీయ రహదారి విస్తరణ భూ సర్వే పనులు ఆదివారం మరోసారి అడ్డుకున్నారు. ఈనెల 5న రెవెన్యూ అధికారులు చేపట్టిన భూ సర్వేను అడ్డుకున్న స్థానికులు, తాజాగా మరోసారి అడ్డుకుని సర్వే పనులు ముందుకు సాగకుండా ఆందోళన చేశారు. గతంలోని అలైన్‌మెంట్‌లో భాగంగా పలుమార్లు సర్వేను అడ్డుకోవడంతో ఎవరికీ భారీగా నష్టం జరగకుండా పూర్తిగా కొత్త రోడ్ నిర్మాణం చేపట్టేలా అలైన్‌మెంట్ చేసి భూ సర్వే పనులు చేస్తున్నారు. అయినా తమ విలువైన భూములు కోల్పోతున్నామంటూ రైతులు ఎన్‌హెచ్‌ఏఐ, రెవెన్యూ అధికారులు చేస్తున్న సర్వేను అడ్డుకుని ముందుకు సాగనివ్వలేదు. పరిహారం చెల్లింపుల విషయంలో స్పష్టత ఇచ్చిన తర్వాతనే సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం



ఎన్నికైనవారిని సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల శాఖ నూతన కార్యవర్గ సభ్యుల ఎగ్జిక్యూటివ్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇద్దరు సభ్యులను కమిటీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శిగా చందూరి మహేందర్, స్టేట్ ఎంసీ మెంబర్‌గా వి.మధుసూదన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కె.సత్యపాల్‌రెడ్డి, సభ్యులు కాసర్ల శ్రీనివాస్, ఎడ్ల కిషన్, ములకల సత్యనారాయణరెడ్డి, సురభి శరత్‌కుమార్, కటుకం హరీశ్, ఉదారి చంద్రమోహన్, చుంచు శంకర్‌వర్మ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ఏడాది క్రితం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అతడిని తీసుకుని ఆటోలో మంచిర్యాల ఆస్పత్రికి బయల్దేరారు. క్యాతనపల్లి వరకు వచ్చేసరికి గేటు పడింది. దీంతో అక్కడే 10 నిమిషాలు నిరీక్షించారు. గేటు తెరిచిన తర్వాత మంచిర్యాల ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి గేటు వద్దకు రాగానే సదరు వ్యక్తి మృతిచెందాడు. పరీక్షించిన వైద్యులు 5 నిమిషాలు ముందు వచ్చి ఉంటే కాపాడేవారమని చెప్పారు.

బీ–జోన్‌కు చెందిన ఓ వ్యక్తిని ఆరు నెలల క్రితం పాము కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులు అతడికి స్థానికంగా ప్రాథమిక చికిత్స చేయించారు. తర్వాత మంచిర్యాల ఆస్పత్రికి బయల్దేరారు. క్యాతనపల్లి వద్దకు వచ్చేసరికి రైల్వేగేటు పడింది. గూడ్సు రైలు ట్రాక్‌పై నిలిచిపోవడంతో అక్కడే ఆగిపోయారు. ఈ క్రమంలో పాము విషం శరీరమంతా పాకడంతో అక్కడే మృతిచెందాడు.

క్యాతనపల్లి రైల్వే గేటు వద్ద ఇటీవల ఇద్దరు యువకులు నిరీక్షించారు. ఎంతకీ గేటు తెరుచుకోకపోవడంతో గేటు కింద నుంచి ట్రాక్ దాటే ప్రయత్నం చేస్తుండగా అటుగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ దుర్మరణం చెందారు.

పుష్కరానికి.. పూర్తయ్యేనా?

- అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం
- 11 ఏళ్లుగా సా....గుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం
- 2013లో పనులు మొదలు
- 70 శాతం పనులకు దశాబ్దం
- మిగతా పనులు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి..
- ఇదీ క్యాతనపల్లి ఆర్వోబీ పరిస్థితి
- ప్రాణాలు పోతున్నా పనులు చేయించేవారు కరువు



అసంపూర్తిగా ఉన్న క్యాతనపల్లి ఆర్వోబీ

మంచిర్యాల–రామకృష్ణాపూర్ ప్రధాన మార్గంలో క్యాతనపల్లి పట్టణంలో 11 ఏళ్ల క్రితం చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొనసా....గుతోంది. నిర్మాణం మొదలు పెట్టి దశాబ్దం దాటినా 70 శాతం పనులే పూర్తయ్యాయి. ఈ ఆర్వోబీ తర్వాత మొదలు పెట్టిన బెల్లంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ), మందమర్రి ఆర్వోబీ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా క్యాతనపల్లి ఆర్వోబీ మాత్రం పూర్తి కావడం లేదు. ఒకవైపు రైల్వే గేటు కారణంగా సకాలంలో వైద్యం అందక కొందరు, రైల్వే క్రాసింగ్ దాటుతూ మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. అయినా 11 ఏళ్లుగా సాగుతున్న ఈ పనులపై ఎవరిని ప్రశ్నించాలో.. ఎవరిని నిందించాలో అర్థంకాని పరిస్థితి.

రామకృష్ణాపూర్: జిల్లా కేంద్రం మంచిర్యాల నుంచి క్యాతనపల్లి మున్సిపాలిటీతోపాటు, రామకృష్ణాపూర్, మందమర్రి, అమరవాది, శేషపల్లి, సారంగపల్లి, తుర్కపల్లి, చిర్రకుంట, ఊరుమందమర్రి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై క్యాతనపల్లి వద్ద రైల్వే క్రాసింగ్ ఉంది. ఈ క్రాసింగ్ కారణంగానే దశాబ్దాలుగా ఈ గ్రామాలు ఆర్టీసీ బస్సు సౌకర్యానికి నోచుకోవడం లేదు. ఇక రైల్వే గేట్ కారణంగా అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లేవారు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. అనేక పోరాటాల ఫలితంగా, ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే, అప్పటి ఎంపీ గడ్డం వివేక్‌వెంకటస్వామి చొరవతో 2013లో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైంది. ఇందుకు రైల్వేశాఖ రూ.34 కోట్లు మంజూరు చేసింది. దీంతో రైల్వే క్రాసింగ్ ప్రభావిత గ్రామాల ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. రెండు మూడేళ్లలో తమకు గేటు కష్టాలు తీరుతాయని భావించారు.

ఆనందం ఆవిరి..

వెంటనే ఆర్వోబీ నిర్మాణ పనులు ప్రారంభించారు. వేగంగా పనులు జరుగుతాయని అంతా భావించారు. కానీ ఆదిలోనే ఆటంకాలు మొదలయ్యాయి. భూసేకరణ, ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారానికే నలుగైదేళ్లు పట్టింది. ఇదే సమయంలో కొందరు కోర్టుకు వెళ్లడం, తర్వాత రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, రైల్వే శాఖల మధ్య సమన్వయంలోపంతో పనుల ప్రారంభం మరింత జాప్యమైంది. దీంతో రైల్వే క్రాసింగ్ బాధితుల ఆనందం ఆవిరైంది. ఏళ్లుగా సాగుతున్న పనులతో తమ కష్టాలు ఇక ఇప్పట్లో తీరవన్న నిర్ణయానికి వచ్చారు.

నత్తనడకన పనులు..

ఇక అన్ని అవరోధాలు దాటుకుని పనులు ప్రారంభించినా 'ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు' అన్న చందంగా ఆర్వోబీ నిర్మాణం సాగుతోంది. నిధులు మంజూరై 11 ఏళ్లు గడిచినా ఇప్పటికీ వంతెన నిర్మాణం పూర్తి కాలేదు. 70 శాతం పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్ మిగతా 30 శాతం పూర్తి చేయడంలో జాప్యం చేస్తున్నాడు. మరోవైపు అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఆర్వోబీ పనులు త్వరగా పూర్తి చేసేలా ఒత్తిడి చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



గేటు పడడంతో ఆగిన అంబులెన్స్, వాహనాలు..

ఇంకెన్నేళ్లు పడుతుందో..

రామకృష్ణాపూర్ పట్టణ ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎంతో కీలకం. క్యాతనపల్లితోపాటు మందమర్రి, అమరవాది, శేషపల్లి, సారంగపల్లి, తుర్కపల్లి, చిర్రకుంట, ఊరు మందమర్రి తదితర గ్రామాల ప్రజలు మంచిర్యాల–క్యాతనపల్లి మీదుగానే రాకపోకలు సాగిస్తారు. నిత్యం వందల మంది ఆస్పత్రులతోపాటు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లివస్తుంటారు. హెల్త్ ఎమర్జెన్సీ సమయంలో రైల్వేగేట్ కారణంగా వేగంగా మంచిర్యాలలోని ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి. సికింద్రాబాద్–న్యూఢిల్లీ రైల్వే ట్రాక్ కావడంతో ఈ మార్గంలో పది నిమిషాలకు ఒక రైలు వెళ్తుంది. దీంతో గేటు తెరిచి ఉండే సమయం కన్నా మూసి ఉండే సమయమే ఎక్కువ. ఒక్కోసారి 30 నిమిషాల నుంచి 40 నిమిషాల వరకు గేటు తీయడం లేదు. గేటు పడిన ప్రతీసారి ప్రయాణికులు పడుతున్న బాధ వర్ణణాతీతం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఇప్పటికైనా పాలకులు చొరవ చూపి ఆర్వోబీ నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమాజంలో మహిళ పాత్ర గొప్పది



మాట్లాడుతున్న రమాదేవి

మంచిర్యాలఅర్బన్: సమాజంలో మహిళ పాత్ర చాలా గొప్పదని తపస్ జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి అన్నారు. మంచిర్యాల తపస్ కార్యాలయంలో ఆదివారం మహిళ దినోత్సవం నిర్వహించారు. వైద్యురాలు సమీరా మాట్లాడుతూ మహిళలందరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం మెమొరీ ఆటలు, భారతీయ ప్రాచీన మహిళల గొప్పదనంపై క్విజ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. వైద్యులు మౌనిక, చంద్రకళ, బీజేపీ జిల్లా మహిళా ఇన్‌చార్జి లావణ్య, తపస్ మహిళ నాయకులు రాజ్యలక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి



మాట్లాడుతున్న బండి రమేశ్

మంచిర్యాలఅర్బన్: టెట్‌తో సంబంధం లేకుండా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ కోరారు. మంచిర్యాలలో తపస్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిత, పీఈటీల పదోన్నతులు చేపట్టాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్, పీఆర్సీ ఎరియర్స్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. మోడల్‌స్కూల్, గురుకుల, కేజీబీవీ, యూ ఆర్ఎస్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎస్జీటీ పోస్టులను జోనల్ పోస్టులుగా మార్చాలని, 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వివరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి బగ్గని రవి, జిల్లా ఉపాధ్యక్షుడు నీలేశ్‌కుమార్, భారతి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠుపై సమరం



ఇంటింటి సర్వే పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు

- నేటి నుంచి ఇంటింటి సర్వే
- 24వ తేదీ వరకు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

మంచిర్యాలటౌన్: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన ఉద్యమం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం ఈనెల 11న మొదలు కానుంది. 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కుష్ఠువ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ఈ ఏడాది జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం కుష్ఠువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు 14 రోజులు ఇంటింటి సర్వేను చేపట్టాలని నిర్ణయించారు. ప్రతీ ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని ఇంటింటికీ వెళ్లి కుష్ఠువ్యాధిగ్రస్తులు ఎవరైనా ఉన్నారా లేదాని పరిశీలించనున్నారు. ఇందుకోసం ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి శరీరంపై మొద్దుబారిన మచ్చలు ఉన్నాయా, కాళ్లు, చేతులు తిమ్మిర్లు ఉన్నా అలాంటి వారిని గుర్తించి వ్యాధితో బాధపడుతున్నారో లేదో వైద్య సిబ్బంది పరీక్షలను నిర్వహిస్తారు.

ప్రజలకు అవగాహన..

ప్రజలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కోసం పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లాష్ కార్డ్స్ గ్రామాలు, పట్టణాల్లో అంటిస్తున్నారు. వ్యాధి గుర్తించిన వారి ఇంటికి నేరుగా వెళ్లి, వారి చికిత్సకు అవసరమైన మందులు ఇస్తున్నారు. ఈ వ్యాధి జిల్లాలో లేకుండా చేయాలన్నదే వైద్య ఆరోగ్యశాఖ ఉద్దేశం. కుష్ఠు వ్యాధిని భయంకరమైన జబ్బుగా పరిగణించకుండా, ప్రభుత్వ ఉద్దేశం అర్థం చేసుకుని, వైద్య సిబ్బంది వచ్చినప్పుడు నిర్భయంగా వివరాలు చెప్పాలని, చికిత్స అందిస్తే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు.

బయటకు చెప్పుకోలేకనే..

జిల్లాలో కుష్ఠువ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి వ్యాధి నివారణకు చర్యలు చేపడుతున్నా, ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదు. గతంలో జిల్లావ్యాప్తంగా జిల్లా వైద్యారోగ్యశాఖ, కుష్ఠు వ్యాధి నిర్మూలన సంస్థలు సంయుక్తంగా ఇంటింటి సర్వేలో బాధితులను గుర్తించి, వారికి వ్యాధి నివారణ కోసం అవసరమైన మందులను ఇచ్చారు. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ఒకవేళ తెలిసినా బయటకు చెబితే సామాజికంగా దూరమవుతామనే భయంతో బాధితులు విషయం దాచిపెడుతున్నారు. తమ కుటుంబ సభ్యులకు, సమీపంలో నివసించే వారికి ఈ వ్యాధి సోకడానికి కారకులవుతున్నారు.

జిల్లాలో కుష్ఠువ్యాధిగ్రస్తుల వివరాలు

సంవత్సరం	గుర్తించిన వ్యాధిగ్రస్తులు
2016–17	73
2017–18	107
2018–19	78
2019–20	154
2020–21	83
2021–22	74
2022–23	113
2023–24	84 (2024 ఫిబ్రవరి 29 వరకు)

వ్యాధిగ్రస్తులను గుర్తిస్తాం



కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం పేరిట ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించిన వారికి వెంటనే చికిత్స అందించి, జిల్లాలో కుష్ఠువ్యాధిగ్రస్తుల నిర్మూలన కోసం కృషి చేస్తాం. కుష్ఠు ఎవరికైనా రావచ్చు. వంశపారంపర్యంగా రాదు. కుష్ఠుకు అన్ని పీహెచ్‌సీలలో చికిత్స అందిస్తున్నాం. – సుబ్బరాయుడు, డీఎంహెచ్‌వో

కుష్ఠు లక్షణాలు

- కుష్ఠువ్యాధి 'మైక్రో బ్యాక్టీరియం లెప్రె' అనే బ్యాక్టీరియా వలన వచ్చే అతి సామాన్య వ్యాధి.
- కుష్ఠు ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుంది.
- చాలా నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి (ఇంక్యుబేషన్ కాలం) సగటున 3 సంవత్సరాలు పడుతుంది.
- వ్యాధి ఎవరికైనా రావొచ్చు. దీనికి వయసు, లింగబేధం లేదు.
- వంశపారంపర్యం కాదు, శాపం–పాపం అంతకన్నా కాదు.
- కుష్ఠు వ్యాధి ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) తో 6 నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయం అవుతుంది. రోగులు పూర్తి సామాజిక జీవితం గడపవచ్చును.
- ప్రారంభ దశలో గుర్తించి ఎండీటీ చికిత్స ఇస్తే కుష్ఠువ్యాధి అంగవైకల్యానికి దారితీయదు.
- చికిత్స పూర్తయిన, చికిత్స తీసుకుంటున్న రోగులలో అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వారా సరిచేయవచ్చు.
- కుష్ఠు మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువగా లేదా ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయి.
- మచ్చలపై స్పర్శ, నొప్పి ఉండదు.
- కాళ్లు, చేతుల నరాలలో వాపు నొప్పి, బలహీనత, తిమ్మిర్లు, ముఖంపై చెవి బయట నూనె పూసినట్లు మెరుస్తున్నా కుష్ఠుగా అనుమానించాలి.
- కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోయినా, కనురెప్పలు పూర్తిగా మూతపడకపోయినా, చేతివేళ్లు స్పర్శ కోల్పోయి, వంకర పోవడం, చేతి మణికట్టు, పాదాలలో బలహీనత, వాలిపోవడం.
- చికిత్సకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు ఇస్తారు.

ఆర్టీసీ జీతాలు పెరిగినయ్..

- ఫిట్‌మెంట్ ప్రకటించిన ప్రభుత్వం
- సంబరాల్లో ఉద్యోగులు



సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు

మంచిర్యాల అర్బన్/ఆదిలాబాద్: ఆర్టీసీ కార్మికులకు 21శాతం ఫిట్‌మెంట్ ప్రకటిస్తూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్ల డించారు. ఈ మేరకు ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పలుచోట్ల సంబరాలు జరుపుకున్నారు. ఉద్యోగులకు 2013 వేతన సవరణ బకాయిలతో పాటు 2017, 2021లకు సంబంధించి పీఆర్సీలను చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో 2013 పీఆర్సీకి సంబంధించి 50 శాతం చెల్లించగా, మిగిలిన ఎరియర్స్‌ను బాండ్లుగా అందజేసింది. ఈ బాండ్ల బకాయిలను సైతం 8.75 శాతం వడ్డీతో ఈ నెల 11 తర్వాత చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఫిట్‌మెంట్‌పై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూనే.. ఉద్యోగ భద్రత విషయంలో కూడా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు.

21శాతం ఫిట్‌మెంట్

ఇప్పటికే 2017కు సంబంధించి 16శాతం మధ్యంతర భృతిని ఇప్పటికే అందిస్తున్నారు. అదనంగా మరో ఐదు శాతాన్ని పెంచి 21శాతం ఫిట్‌మెంట్‌గా అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 పీఆర్సీని 21శాతం ఫిట్‌మెంట్‌తో అదే ఏడాది ఏప్రిల్ 1నుంచి అందించాలని నిర్ణయించిన ప్రభుత్వం 2021 పీఆర్సీపై మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం ప్రకటించిన ఈ ఫిట్‌మెంట్ జూన్ ఒకటవ తేదీ నుంచి అమల్లోకి రానుంది. పేస్కేల్–2017 బకాయిలను ఉద్యోగుల పదవీ విరమణ సమయంలో వడ్డీ లేకుండా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగుల జీతం రూ. 8వేల నుంచి 11వేల వరకు పెరిగే అవకాశం ఉంటుందని వివరించింది.

విలీనంపై స్పష్టత కరువు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తం అయింది. అయితే ఈ విషయమై ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఇటీవల కాంగ్రెస్ సర్కారు మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టడంతో పనిభారం పెరిగి నా శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. ఫిట్‌మెంట్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూనే ఉద్యోగ భద్రతపై కూడా స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఉద్యోగుల సంఖ్య

డిపో	ఉద్యోగులు
ఆదిలాబాద్	440
భైంసా	268
నిర్మల్	468
ఉట్నూర్	120
ఆసిఫాబాద్	321
మంచిర్యాల	516
ఆర్ఎంవో	52
మొత్తం	2,185

ఉద్యోగుల్లో ఆనందం..



తెలంగాణ ప్రభుత్వం 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆనందం నెలకొంది. ఫిట్‌మెంట్ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్న ప్రభాకర్‌కు కృతజ్ఞతలు.

– రవీంద్రనాథ్, మంచిర్యాల డీఎం

వేతన సవరణ చేయాలి..



ప్రభుత్వం కార్మికుల బాధను అర్థం చేసుకుని త్వరగా మళ్లీ వేతన సవరణ చేయాలి. ఫిట్‌మెంట్ 35 శాతం ఇవ్వాల్సి ఉండగా 21 శాతానికి పరిమితం కావటం, 2013 పీఆర్‌సీ మాత్ర ఇవ్వటం నిరాశ మిగిల్చింది. పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ పీఎఫ్, బాండు బకాయిలు చెల్లించాలి.

– భీమేశ్వరావు, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి

ఆర్టీసీ విలీనం వేగవంతం చేయాలి..



ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశం పక్కన పెట్టడం సరికాదు. యూనియన్లతో సంప్రదింపులు జరుపకుండా ఏకపక్షంగా నిర్ణయిం తీసుకున్నారు. పాత బకాయిలను చెల్లించటం మినహా కొత్తగా కార్మికులకు ఒరిగింది ఏమీలేదు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ వేగవంతం చేయాలి.

– కెఎస్.రావు, ఆర్టీసీ ఉద్యోగి, మంచిర్యాల డిపో



పనిచేయని నిఘానేత్రం

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దున 63వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న అంతర్రాష్ట్ర వంతెనపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగుతాయి. కొల్లూర్‌లో ఇసుక క్వారీలు ఉండటంతో నిత్యం వందలాది లారీలు వస్తునే ఉంటాయి. సరిహద్దులపై నిఘా కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. ఈ విషయమై ఎస్సై రాజేందర్‌ను వివరణ కోరగా త్వరలోనే బాగు చేయించి నిఘాను పటిష్టం చేస్తామని తెలిపారు. – కోటపల్లి



క్లుప్తంగా

ఇసుక లారీ పట్టివేత


పోలీస్ స్టేషన్‌లో ఇసుక లారీ

మందమర్రిరూరల్(చెన్నూర్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆదివారంలోని అందుగులపేట ఫ్లైవోవర్ వంతెన సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెబ్బెన నుంచి జగిత్యాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. ఇసుకకు సంబంధించిన పత్రాలు చూపించాలని డ్రైవర్‌ను అడగగా ఎలాంటి పత్రాలు లేవని, అక్రమంగా తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం లారీని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని కడంబా సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చింతలమానెపల్లి మండలం గంగాపూర్‌కు చెందిన చాపిలె శ్రీనివాస్, తపన్ ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్ వైపు వస్తుండగా కడంబా గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సిబ్బందితో కలిసి అటుగా వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ వారిని గమనించి తన వాహనంలో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పెద్దవాగులో యువకుడి గల్లంతు


విఘ్నేష్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన మల్లోరి విఘ్నేష్ అలియాస్ విక్కి (21) తన నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం ఆటోలో మద్వాయిగూడ సమీపంలో గల జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. ప్రాజెక్టు వద్ద గల డైవర్షన్ కెనాల్‌లో లోతుగా ఉన్న నీటిలో మునిగి గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న మాదాసు మల్లేష్ అనే యువకుడు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించగా సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు తాత్కాలికంగా నిలిపివేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కొండపెల్లి బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. నేర్పలి గ్రామానికి చెందిన రావూజీ (48) ఆదివారం రాత్రి కొండపల్లి బస్టాండ్ వద్దకు వచ్చి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెళ్లొస్తాం మల్లన్న..

- ముగిసిన వేలాల జాతర
- చివరి రోజూ మొక్కులు, పూజలు ..
- తిరుగుముఖం పట్టిన భక్తజనం

జైపూర్: మహా శివరాత్రి సందర్భంగా మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన మల్లన్నస్వామి జాతర ఆదివారం ముగిసింది. జాతరకు తెలంగాణతోపాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. మల్లన్నను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా భక్తులు మొదటి రోజున గ్రామం సమీపంలోని గట్టు మల్లన్న స్వామికి బోనాలు పోసి, పట్నాలు వేసి జాగారం చేశారు. రెండో శనివారం వేలాల గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకుని సాముహిక పట్నాలు వేసి, బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం జాతర ముగియడంతో సుదూరప్రాంతాల నుంచి తరలివచిన భక్తులు ఇక వెళ్లొస్తాం మల్లన్న... సల్లంగా సూడు అంటూ తిరుగు పయనమయ్యారు. జాతరకు 3 లక్షలకుపైగా భక్తులు తరలివచ్చారు. చివరి రోజున ఉదయం నుంచి సాయంత్రం ఒగ్గు పూజారులు సమక్షంలో భక్తులు పట్నాలు వేసి, బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.


జాతర ముగియడంతో తిరుగు పయనంలో భక్తులు

గంగమ్మకు పట్నాలు

వేలాల జాతరకు వచ్చిన జయశంకర్ భూపాల్‌పల్లి, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లా గంగ అవతలి ప్రాంత భక్తులు ఆదివారం ఉదయం గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి సంప్రదాయబద్ధంగా గంగమ్మతల్లి పట్నాలు వేశారు. కొంతమంది భక్తులు గంగమ్మతల్లికి ఎదుర్చి గొర్రె పిల్లలను బలి ఇచ్చారు. మరికొంతమంది ఎదురిచ్చిన గొర్రె పిల్లలను గంగలో వదలి పెట్టారు.


గంగమ్మకు బోనాలతో వస్తున్న మహిళలు


గంగమ్మతల్లికి పట్నాలు..

వేలాల ఆదాయం.. రూ.53 లక్షలు

జైపూర్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజులపాటు వేలాలలో నిర్వహించిన మల్లన్న జాతరకు 3 లక్షలకుపైగా భక్తులు తరలి వచ్చారు. మొక్కులు చెల్లించుకుని స్వామివారికి వివిధ రూపాల్లో కానుకలు సమర్పించారు. ఆదివారం జాతర ముగియడంతో హుండీలను లెక్కించారు. ఆలయ ఈవో రమేశ్ సమక్షంలో దేవాదాయశాఖ సిబ్బంది, వాలంటీర్లు గట్టు మల్లన్న, వేలాల శ్రీమల్లికార్జునస్వామి హుండీలు లెక్కించారు. జాతర మొదటిరోజు గుట్టపైన ప్రత్యేక దర్శనం ద్వారా రూ.4,14,300, పట్నాల టికెట్ల ద్వారా రూ.97,700, కేశకండనం టికెట్ల ద్వారా రూ.21,600, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.1,75,000, కొబ్బరి ముక్కల సేకరణ ద్వారా రూ.10 వేల ఆదాయం వచ్చింది. హుండీ ద్వారా రూ.11,27,199 వచ్చింది మొత్తం గుట్టపై రూ.18,45,799 ఆదాయం వచ్చింది. 0.830 గ్రాముల మిశ్రమ బంగారం, 1.936 కిలోల వెండి వచ్చింది. రెండోరోజు వేలాల ఆలయం(కింద) సులభదర్శనం ద్వారా రూ.5,28,000, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.3,25,450, పట్నాల ద్వారా రూ.3,24,150, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.3,78,000, కేషకండనం ద్వారా రూ.20 వేల, కొబ్బరి ముక్కల సేకరణ ద్వారా రూ.20 వేలు, హుండీ ద్వారా రూ.19,32,456 ఆదాయం సమకూరింది. మొత్తంగా వేలాల మల్లికార్జునస్వామికి రూ.35,28,056 ఆదాయంతోపాటు 592 గ్రాముల మిశ్రమ బంగారం, 2.316 కిలోల వెండి వచ్చింది. రెండు రోజుల జాతరతో మొత్తంగా రూ.53,73,855 ఆదాయం సమకూరింది. గతేడాది రూ.48 లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.5.73 లక్షలు ఎక్కువగా వచ్చిందని ఈవో రమేశ్ తెలిపారు. ఎస్సై ఉపేందర్‌రావు నేతృత్వంలో ఈ మొత్తాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చారు.


హుండీలు లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది, వలంటీర్లు

అ'పూర్వ' సమ్మేళనం

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 1992–93 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 32 ఏళ్ల అనంతరం కలుసుకున్న వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. అప్పుడు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు.


రామకృష్ణాపూర్: 1992-93 బ్యాచ్ విద్యార్థులు


వేమనపల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనం

వేమనపల్లి(బెల్లంపల్లి): నీల్వాయిలోని జెడ్పీ హైస్కూల్‌లో 1997–98 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులు రామన్న, రామ్మోహన్, లక్ష్మీకాంత్‌ను సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సునీల్, అజ్జు, దేవేందర్, సతీష్, జనార్దన్, శంకర్, రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్ష

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ఆదిలాబాద రీజియన్‌లో ప్రశాంతంగా జరిగింది. 843 మంది దరఖాస్తు చేసుకోగా 781 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 62 మంది గైర్హాజరయ్యారు. 92.65 శాతం నమోదైనట్లు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. ఆదిలాబాద్ రీజియన్ వ్యాప్తంగా మూడుచోట్ల పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌లో సీవోఈ బాలికల కళాశాల, ఆసిఫాబాద్‌లో బాలుర గురుకుల కళాశాల, బెల్లంపల్లిలో బాలుర గురుకుల సీవోఈ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు.


బెల్లంపల్లిలో పరిశీలిస్తున్న ఆర్సీవో స్వరూపారాణి

విద్యార్థుల హాజరు వివరాలు

ఆదిలాబాద్‌లో ఆరోతరగతిలో 116 మందికి గానూ 108 మంది హాజరుకాగా ఎనిమిదిమంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 114 మందికి గానూ 110 మంది హాజరుకాగా నలుగురు గైర్హాజరయ్యారు. ఆసిఫాబాద్‌లో ఆరో తరగతిలో 95 మందికిగానూ 84 మంది హాజరుకాగా 11 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్లో 60 మందికి గానూ 48 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. బెల్లంపల్లిలో ఆరోతరగతిలో 227 మందికిగానూ 215 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 231 మందికి గానూ 216 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు.

అడవిలో అమృతధార

- వన్యప్రాణుల దాహార్తి తీరుస్తున్న సోలార్ ఫిట్లు

వేమనపల్లి(బెల్లంపల్లి): అభయారణ్యంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ఏర్పాటు చేసిన సోలార్ ఫిట్‌లు, చెక్‌డ్యాంలు, ఊట చెరువులు, సాసర్‌ఫిట్‌లు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కంప నిధులతో జిల్లాలోని అన్నిరేంజ్‌ల పరిధిలో సోలార్ ఫిట్‌లు, చెక్‌డ్యాంలు ఏర్పాటు చేశారు. అటవీ జంతువులతో పాటు మేత కోసం అడవికి వెళ్లే జంతువులు, పక్షులు, అటవీ సిబ్బంది, కాపరులకు జీవజాలం అమృతధారలా పనిచేస్తోంది. కుశ్నపల్లి రేంజ్‌లోని కొత్తపల్లి బీట్‌లలో 15 ఊట చెరువులు, 2 సోలార్‌ఫిట్‌లు, నాగారాం, మంగెనపల్లిలో 2 సోలార్‌ఫిట్‌లు, ఒడ్డుగూడెం అటవీబీట్‌లో ఏర్పాటు చేసిన 3 చెక్‌డ్యాంలు, సాసర్‌పిట్లు జంతువుల దాహార్తి తీరుస్తున్నాయి. నీల్వాయి రేంజ్‌లోని మల్లంపేటలో కోటపల్లి రేంజ్‌లోని కొండంపేట, చెన్నూర్, భీమారం అటవీరేంజ్‌లలో 4 సోలార్‌ఫిట్‌లు నిర్మించారు.

నిరంతరం నీటి నిల్వలు

ప్రస్తుతం ఎండలు మండుతున్నా, వర్షాలు తగ్గుముఖం పట్టినా సోలార్ ఫిట్‌లు, చెక్‌డ్యాంలు నీటినిల్వలతో కళకళలాడుతున్నాయి. సోలార్ సిస్టమ్‌కు మోటారు అనుసంధానం చేసి నీటిని తోడుతూ పక్కనే ఉన్న చెరువులను నింపుతున్నారు. జాజులపేట, సుంపుటం, రామలక్ష్మణ్‌ల గుట్ట, పాశీనీళ్లతోవ, నెన్నెల మండలం కొత్తూర్, ధర్మారం అడవుల్లో సహజసిద్ధమైన నీటి ఊటలు ఉన్నాయి. వీటి వద్ద చెక్‌డ్యాంలు నిర్మించగా ఎల్లవేళలా నీటితో కళకళలాడుతున్నాయి. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఓయాసిస్‌లాగా పని చేస్తున్నాయి. ఈ నీటి జాడలు వెతుక్కుంటూ పక్కనే ఉన్న తాడోబా, తిప్పేశ్వర్, కవ్వాల్ అభయఅరణ్యం నుంచి పులులు సైతం వలస వస్తున్నాయి. వీటి సంరక్షణకు నీటి నిల్వల కోసం అటవీ అధికారులు అంకితభావంతో పనిచేస్తున్నారు.


నీటితో కళకళలాడుతున్న కుంట(సోలార్ ఫిట్)

పీడీఎస్ బియ్యం పట్టివేత

బెజ్జూర్: నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. స్థానికంగా తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుకుడలో తనిఖీలు నిర్వహించారు. ఖలీఫ్ హేమద్ ఇంట్లో తనిఖీ చేయగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. బియ్యాన్ని బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సీహెచ్ రాణా ప్రతాప్ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పీసీ మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.


బెజ్జూర్: బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధి కారులు నిర్వహించిన తనిఖీల్లో రేషన్‌బియ్యం పట్టుబడ్డాయి. తూడురు సురేశ్‌కు చెందిన కి రాణా దుకాణంలో నిల్వ ఉంచిన 1.5 క్వింటాళ్లు, ఇమ్రాన్ కిరాణా దుకాణంలో 1.26 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (డీటీలు) శ్రీనివాస్, శ్యాంలాల్ తెలిపారు. ఇరువురిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

ఎస్టీపీపీలో వైద్యశిబిరం

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గల బ్యాచిలర్స్ ట్రెయినీ హాస్టల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ చిన్న బసివిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రుద్రభట్ల రఘువంశీ, అవని, విజయ్‌కుమార్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ యోగేశ్ పర్మార్, ఎస్‌వోటూ జీఎం వెంకటయ్య, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


వైష్ణవి


శిరీష

మంచిర్యాలటౌన్: జాతీయస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వైష్ణవి, శిరీష ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు దాద్రానగర్‌హవేలిలో జరిగే 52వ జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు కె.వైష్ణవి, జి. శిరీషను జిల్లా యువజనల క్రీడల అధికారి రాజ్‌వీర్ అభినందించారు.

రెఫరీగా కళ్యాణ్


జుమిడి కళ్యాణ్

52వ సీనియర్ మహిళల జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు రెఫరీగా మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలానికి చెందిన పీఈటీ జుమిడి కళ్యాణ్ ఎంపికయ్యాడని హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. కళ్యాణ్‌ను జిల్లా యువజన, క్రీడల అధికారి రాజ్‌వీర్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి రమేశ్‌రెడ్డి, వాగ్దేవి పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, పీడీ సదానందం, కోచ్ సునార్కర్ అరవింద్ అభినందించారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన బైక్

- ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి శివారు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం...కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పైకాజిగూడకు చెందిన ముంజం మహేష్ (23), తాండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన బాలకృష్ణ పని నిమిత్తం తాండూర్ వైపు నుంచి పల్సర్ బైక్‌పై బెల్లంపల్లి వైపు బయలుదేరారు. కన్నాల జాతీయ రహదారి తిరుమల హిల్స్ పెట్రోల్ బంక్ వద్ద తాండూర్ వైపు నుంచి మంచిర్యాల వైపునకు వెళ్తున్న కంటైనర్ యూటర్న్ తీసుకుంటుండగా వేగంగా ఢీకొన్నారు. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలకృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో మంచిర్యాలకు రెఫర్ చేశారు.


ఘటనాస్థలంలో మహేష్, బాలకృష్ణ

ప్రాణాలు తీస్తున్న యూటర్న్...

జాతీయ రహదారి తిరుమల హిల్స్ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ వాహన చోదకుల ప్రాణాలను బలి తీసుకుంటోంది. ఏడాది కాలంలో ఐదుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తాజాగా మరొకరిని బలి తీసుకుంది. నెల రోజుల క్రితం భీమిని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు, కుమారుడు బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా అదే యూటర్న్ వద్ద ఘటన జరగడంతో వాహనదారుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు చేపట్టని హైవే అధికారులు

యూటర్న్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా నేషనల్ హైవే అధికారుల్లో చలనం లేకుండా పోతోంది. నిబంధనలకు విరుద్ధంగా యూటర్న్ ఏర్పాటు చేశారనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్న యూటర్న్‌ను, సోమగూడెం నుంచి తిరుమలహిల్స్ వరకు నిబంధనలకు వ్యతిరేకంగా హైవేను ఆనుకుని నిర్వహిస్తున్న మద్యం, బెల్ట్ షాపులను ఎత్తివేయాలని కన్నాల మాజీ సర్పంచ్ మంద అనిత ఈ పాటికే రెండుసార్లు హైవే, ఎక్సైజ్ శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

బీజేపీలోకి 'గొడం'



ఢిల్లీలో తరుణ్‌చుగ్, డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న గొడం నగేశ్

- బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన మాజీ ఎంపీ
- ఢిల్లీలో కాషాయం కండువా కప్పుకున్న నగేశ్
- అందరూ చేరినట్టే ఆయన చేరారంటున్న ఎంపీ 'సోయం'
- సర్వే చేసి టికెట్ ఇస్తారంటున్న వైనం
- మారుతున్న రాజకీయ సమీకరణాలు

సాక్షి,ఆదిలాబాద్: మాజీ ఎంపీ గొడం నగేశ్ బీజేపీలో చేరారు. బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అధినేత కేసీఆర్‌కు లేఖను పంపించారు. కొద్ది రోజులుగా ఆయన కాషాయ పార్టీలో చేరుతారని జరిగిన ప్రచారం నిజమైంది. మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు జలగం వెంకట్రావ్, శానంపూడి సైదిరెడ్డితో కలిసి ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో ఆదివారం కాషాయ కండువా కప్పుకున్నారు. ఇందులో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో పని చేసేందుకు..

బీజేపీలో చేరిన అనంతరం గొడం నగేశ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని వివరించారు. ఈమేరకు ఆయన నాయకత్వంలో పనిచేయాలని ఉందని, అందుకోసమే బీజేపీలో చేరినట్లు పేర్కొన్నారు.

అందరూ చేరినట్లే ఆయన చేరారు..

గొడం నగేశ్ బీజేపీలో చేరిక విషయంపై ఎంపీ సోయం బాపూరావును సాక్షి ఫోన్‌లో సంప్రదించగా అందరు చేరినట్లే ఆయన కూడా చేరారన్నారు. ఇది వరకు మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కూడా చేరారన్నారు. పార్టీ సర్వే చేసి టికెట్ ఇస్తుందని పేర్కొన్నారు. నా కంటే బెటర్‌గా ఉంటే ఆయనకే వస్తుందన్నారు. ఎంపీ సోయం ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నగేశ్ బీజేపీ టికెట్ కన్ఫామ్‌తోనే పార్టీలో చేరారా..? లేదా అన్నది స్పష్టం కావాల్సి ఉంది. ఈ విషయంలో ఆయనను ఫోన్‌లో సంప్రదించగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

రెండో జాబితాలో ప్రకటించేనా..

బీజేపీ రెండో జాబితా సోమవారం వెలువడొచ్చనే పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో ఆదిలాబాద్ అభ్యర్థిని ప్రకటిస్తారా.. లేని పక్షంలో మూడో జాబితా వరకు వేచి చూడాల్సి వస్తుందా అనేది కొద్ది గంటల్లో తేలనుంది. ఏదేమైనా బీజేపీలో ఈ సమీకరణాలు ఆసక్తి కలిగిస్తున్నాయి. ప్రధానంగా మహబూబాబాద్ నుంచి బీఆర్ఎస్ పార్టీకే చెందిన మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి గొడం చేరడం గమనార్హం. అక్కడ లంబాడా సామాజిక వర్గానికి టికెట్ కేటాయించిన పక్షంలో ఆదిలాబాద్‌లో ఆదివాసీ సామాజికవర్గానికి ఇవ్వచ్చని ఆ పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. ఏదేమైనా ఆదిలాబాద్ సిట్టింగ్ స్థానంలో బీజేపీ పరంగా అభ్యర్థి ఎంపికపై అందరు ఆసక్తిగా గమనిస్తున్నారు. తాజాగా చోటు చేసుకుంటున్న రాజకీయ సమీకరణాలపై అందరి దృష్టి నెలకొంది. టికెట్ ఎవరికి వస్తుందనే ఉత్కంఠ కొనసాగుతోంది.